క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మహేశ్వరం: పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ.17 కోట్లతో కందుకూరు మండల పరిధి నేదునూరు గ్రామంలో శనివారం ఉదయం 11.45 గంటలకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుందని వైస్ ఎంపీపీ మాజీ సభ్యురాలు శమంత శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ రానున్నారని తెలిపారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడకు చెందిన పద్మారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ యూత్ నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి.. సమస్యను మేయర్, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ దృష్టికి తెసుకెళ్లారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి రూ.60 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధిత వ్యక్తికి చెక్కును అందచేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

మంత్రి పర్యటనను జయప్రదం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో శనివారం రాష్ట్ర ఐటీశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్ బాబు పర్యటించనున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. మంత్రి పర్యటనను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు జల్‌పల్లి మున్సిపాలిటీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 10 గంటలకు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఆర్‌సీఐ క్రాస్‌రోడ్డులో పీహెచ్‌సీకి శంకుస్థాపన, తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో 10.30 గంటలకు పీహెచ్‌సీ, 11 గంటలకు డీసీపీ కార్యాలయానికి, 12 గంటలకు కందుకూరు మండలం నేదునూరు రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు.

మూడు రోజుల్లో బోనస్

పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి

తలకొండపల్లి: రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి మూడు రోజుల్లోగా బోనస్ డబ్బులు నేరుగా వారి ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2300తో పాటు, అదనంగా రూ.500 జమ అవుతున్నాయని పేర్కొన్నారు. మండల పరిధి లింగరావుపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 2,837 క్వింటాళ్ల 60 కిలోల ధాన్యాన్ని 55 మంది రైతుల నుంచి సేకరించామని వెల్లడించారు. కొంత మందికి బోనస్ జమ అయిందని, మిగతా వారికి జమ కానుందన్నారు. రైతు సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వారికి ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేస్తుందని స్పష్టంచేశారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

యాచారం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తక్కళ్లపల్లి గ్రామం గుట్టపై కొలువైన వేంకటేశ్వర స్వామికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామికి, మరకత శివలింగానికి పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం కార్తీక భోజనాలు చేశారు. కార్యక్రమంలో భక్తులు వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధుగుప్తా, సాయిరాంగుప్తా,వేణుగుప్తా పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా

ఆమనగల్లు: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి.. తన పదవితో పాటు.. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపినట్లు సాయి తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.



మహేశ్వరం: కందుకూరు మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు జయేందర్ తదితరులు



తుక్కుగూడలో..

కేసీఆర్ పుణ్యమే తెలంగాణ

- రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర కీలకం
- దీక్షా దివస్‌లో బీఆర్‌ఎస్ శ్రేణులు
- పార్టీ జెండాలు ఆవిష్కరణ

తుక్కుగూడ: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుణ్యమే తెలంగాణ ఏర్పాటు అని ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ అన్నారు. దీక్షా దివాస్ సందర్భంగా శుక్రవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఆయన సంకల్పబలంతోనే సకల జనుల కల నెరవేరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుమన్, రవినాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా..

మీర్‌పేట: తెలంగాణ సాధనకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురైనా ఆమరణ నిరాహార దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారని కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు ఎం.ఏ.రజాక్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు దీక్షా దివస్ సందర్భంగా నందిహిల్స్ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా కేసీఆర్ దశాబ్ద కాలంలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అర్కల కామేష్‌రెడ్డి, బాలరాజు, సునీత, జగాల్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, హమునాయక్, ప్రవీణ్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

క్షీరాభిషేకం

పహాడీషరీఫ్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొక్కవోని దీక్షతోనే ప్రత్యేక తెలంగాణ సాధన సాకారమయిందని బీఆర్‌ఎస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు శంషుద్దీన్ హమేద్ అన్నారు. దీక్షా దివస్ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.



మీర్‌పేట: నందిహిల్స్ చౌరస్తాలో..

సలహా కేంద్రంతో సమస్యలు పరిష్కారం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

- గృహ హింస బాధితులకు సలహా కేంద్రం
- ఎస్‌ఐ రాజశేఖర్

మీర్‌పేట: కుటుంబ, వివాహ సంబంధ తదతర సమస్యలను చర్చలు, పరస్పర అవగాహనతో పరిష్కరించుకునేందుకు కుటుంబ సలహా కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. సీడీఈడబ్ల్యూ (కమ్యూనిటీ ఆధారిత కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు), పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నందనవనంలో మహిళలకు అవగాహన కల్పించారు. సెంటర్ సేవలు, మహిళల హక్కులు, చట్టాలు, గృహ హింసపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గృహ హింస బాధితుల కోసం సలహా కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. రిఫరల్, వ్యక్తిగత కౌన్సెలింగ్, జంట కౌన్సెలింగ్, కుటుంబ కౌన్సెలింగ్‌తో పాటు ఈ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మాధవి, సరిత, కౌన్సిలర్స్ నవ్య రమ్య, శ్రావణి పాల్గొన్నారు.

10న మాదిగల మహాసభ

ఇబ్రహీంపట్నం: మాదిగల మహాసభను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ నాయకులు కొండ్రు ప్రవీణ్, బోసుపల్లి ప్రతాప్, పరమేష్‌లు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. డిసెంబర్ 10న ఇబ్రహీంపట్నంలో జరగనున్న సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో జేఏసీ నేతలు నర్సింహ్మ, పురుషోత్తం, కృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

ఆమనగల్లు: డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు మండలంలో ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి సర్వే, వ్యాధి అనుమానితులను గుర్తించాలని డాక్టర్ పరిక్షిత్ నరేందర్ అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనపై శుక్రవారం వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి అనుమానితులను ఎలా గుర్తించాలో సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మైమూనా, ఎంపీహెచ్ఈఓ తిరుపతిరెడ్డి, ఆరోగ్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- కలుషిత ఆహారంతో చిన్నారుల మృత్యువాత
- పట్టించుకోని ప్రభుత్వం: ఏబీవీపీ

ఇబ్రహీంపట్నం: గురుకుల విద్యార్థుల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ డి.శివకృష్ణ ఆరోపించారు. కలుషిత ఆహారం తిని ప్రాణాలు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల విద్యార్థుల మరణాలపై, వారి సమస్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఒకే సంవత్సరంలో 886 మంది చిన్నారులు ఫుడ్ పాయిజన్‌తో మృత్యువును జయించగా.. 51 మంది మృత్యువాత పడ్డారని ఆందోళన వ్యక్తంచేశారు. చిన్నారుల మృతితో వారి తల్లిదండ్రుల బాధ తీర్చలేనిదని పేర్కొన్నారు. బాలబాలికలకు నాణ్యతతో కూడిన భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగదీశ్, మహేందర్, నవీన్, అజయ్, అశ్వంత్, మౌనిక, వాణి, స్వాతి, సుప్రియ, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక.. అప్పులు చేసి

- ఇబ్బంది పడుతున్న కార్మికులు
- సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య

తలకొండపల్లి: మూడు నెలలుగా బిల్లులు రాక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే బిల్లులు చెల్లించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని కోరారు. 9,10 తరగతులకు సంబంధించి 3 నెలలుగా బిల్లులు రాక.. కుటుంబ పోషణ భారమై ఇక్కట్లు పడుతున్నారని పేర్కొన్నారు. అప్పు చేసి వంట సరుకులు కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లు పెంచాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం హెచ్ఎం ఝాన్సీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన మండల అధ్యక్షురాలు ప్రేమలత, కార్యదర్శి రమాదేవి, కోశాధికారి మంజుల, వసంత, రాములమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

నూతన నియామకం



నూతన సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న సమితి జిల్లా అధ్యక్షుడు

మహేశ్వరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) మహేశ్వరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని సమితి జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ శుక్రవారం తెలిపారు. సమితి అధ్యక్షుడిగా గణేశ్, ఉపాధ్యక్షుడిగా మల్లేశ్, అధికార ప్రతినిధిగా స్వామి, కార్యదర్శిగా భిక్షపతిలను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు.

ఎంఎస్‌పీ నూతన సభ్యులు..

మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) మండల అధ్యక్షుడిగా ఎర్ర కృష్ణ మాదిగ, ఉపాధ్యక్షుడిగా అర్జున్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబు మాదిగ, సమితి సీనియర్ నాయకులు బక్కని రవి, బొర్ర రవి, ఘట్టగళ్ల ప్రశాంత్, తొంట రవి, నవీన్ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జిల్లెలగూడ ఫీడర్ పరిధి మందమల్లమ్మ ఎక్స్‌రోడ్డు నుంచి టీకేఆర్ కళాశాల కమాన్, శక్తినగర్, అంబేడ్కర్‌నగర్, గాయత్రినగర్, న్యూ గాయత్రినగర్, ఓల్డ్ గాయత్రినగర్ కాలనీ, డీఆర్‌ఆర్ హోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ నందిహిల్స్ ఫీడర్ పరిధి టీచర్స్‌కాలనీ, నాగార్జునహిల్స్, వేంకటేశ్వర హిల్స్, చైతన్య హిల్స్, నందిహిల్స్ రోడ్ నెం–1–22, ప్రశాంతిహిల్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11కేవీ కేశవరెడ్డి ఫీడర్ కింది టీఎస్‌ఆర్ నగర్, ప్రశాంతిహిల్స్ రోడ్–1,2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీస్, మీర్‌పేట పోలీస్‌స్టేషన్, సీతా హోమ్స్‌లో మధ్యాహ్నం 2 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ సాయిబాలాజీ హోమ్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు సాయిబాలాజీ హోమ్స్ ఫేస్–1,2, సాయినగర్, గాయత్రిహిల్స్, మున్సిపల్ కాలనీ, శ్రీవిద్య టౌన్‌షిప్, గ్రీన్‌రిచ్‌కాలనీ, బాలాజీనగర్, టీఆర్‌ఆర్ కాలనీ, లక్ష్మీ ఎన్‌క్లేవ్, బడంగ్‌పేట్ సర్కిల్, టెలిఫోన్ ఎక్స్చేంజ్, శాంతినగర్ కాలనీల్లో అంతరాయం కలగనుందని తెలిపారు. అదే విధంగా 11 కేవీ బడంగ్‌పేట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతినగర్, బీకే నగర్, బృందావన్‌కాలనీ, శ్రీవిద్యా టౌన్‌షిప్, గాయత్రిహిల్స్, షిరిడీ ఎన్‌క్లేవ్, బడంగ్‌పేట్ విలేజ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పిల్లలను పట్టించుకోని ప్రభుత్వం

- ఇంత చలిలో.. చన్నీటి స్నానమా?
- కలుషిత ఆహారంతో ఆస్పత్రుల పాలవుతున్న చిన్నారులు
- హాస్టల్లో ఉండలేక ఇంటిబాట పడుతున్న వైనం
- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు
- గురుకులాలను సందర్శించిన పార్టీ శ్రేణులు



నాదర్‌గుల్ గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీరాములుయాదవ్ తదితరులు

బడంగ్‌పేట్: విద్యార్థులు చలితో గజగజ వణుకుతూ.. చన్నీటి స్నానం ఎలా చేస్తారని హాస్టల్ సిబ్బందిని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రశ్నించారు. చిన్నారులకు వేడినీటిని అందించాలని డిమాండ్ చేశారు. కలుషిత ఆహారంతో పిల్లల ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గురుకులాల్లో ఉండలేక ఇంటిబాట పడుతున్నారని పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధి ఎస్సీ,ఎస్టీ,బీసీ గురుకుల పాఠశాలలను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ ఏడాదిలో 51 మంది విద్యార్థులను గురుకుల చదువు పేరుతో పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్క గురుకులంలో కూడా తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని తెలిపారు. స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా చూడవలసిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే గురుకులాలను సందర్శించి, బాలబాలికలకు కావలసిన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల సునిత, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, భాగ్యనగర్ సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, మహేశ్, రవికాంత్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సర్కార్ ప్రాధాన్యం

- నేటి రైతు పండుగను జయప్రదం చేయండి
- కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: ఏడాది పాలన కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి రూ.54,280 కోట్లు ఖర్చు చేసిందని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసిందని తెలిపారు. ఈ నెల 30న మరో 4 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయనుందని వెల్లడించారు. వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ నుంచి రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 సాయం అందజేయనుందని పేర్కొన్నారు. వరి సాగులో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో రైతు పండుగ జరగనుందని, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు తరలి వచ్చి, సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మార్కెట్ డైరెక్టర్‌లు అజీం, శ్రీశైలం, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, శ్రీకాంత్, చెన్నయ్య, శ్రీను ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: రైతు సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలిపారు. ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని చెప్పారు. ఈ నెల 30న మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో నిర్వహించనున్న రైతు పండుగకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి, జయప్రదం చేయాలని కోరారు.

మాడ్గులలో..

మాడ్గుల: రైతు సదస్సును జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. గడిచిన ఏడాది పాలన కాలంలో వ్యవసాయ రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించిందని తెలిపారు.

సదస్సుకు తరలిన రైతులు

యాచారం: మహబూబ్‌నగర్ జిల్లాలో నేడు జరగనున్న రైతు సదస్సు, ప్రజా పాలన విజయోత్సవ సభకు యాచారం మండలం నుంచి రైతులు, కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల వ్యవసాయాధికారి రవినాథ్ ఆధ్వర్యంలో యాచారం రైతువేదిక, మాల్ చౌరాస్తా, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్ పర్సన్ గీత



తలకొండపల్లి: మండలం నుంచి రైతు సదస్సుకు తరలుతున్న రైతులు



యాచారం: సదస్సుకు వెళ్తున్న రైతులు

కాంగ్రెస్‌ది నియంత పాలన

- ఫలించిన గిరిజనుల పోరాటం
- ఫార్మా భూసేకరణను విరమించుకున్న ప్రభుత్వం
- బీఆర్‌ఎస్ నేతలు

ఆమనగల్లు: వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాసిటీ భూ సేకరణకు వ్యతిరేకంగా గిరిజనులు పోరాటం చేసినందువలనే.. ప్రభుత్వం వెనుకడుగు వేసిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అనురాధ అన్నారు. రేవంత్ సర్కార్ నియంత పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా లగచర్ల, హకీంపేట, పోలెపల్లి గ్రామాల్లో అధికార పార్టీ కాంగ్రెస్ ఫార్మాసిటీ కోసం బలవంతంగా భూ సేకరణకు ప్రయత్నించిందని విమర్శించారు. బాధిత గ్రామాల ప్రజల పోరాట ఫలితమే.. ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించిందని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ప్రజలు తిరగబడతారని ప్రభుత్వం గుర్తించుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు సయ్యద్ ఖలీల్, రాములుయాదవ్, సాయిలు, రమేశ్, వెంకటేశ్, గణేశ్‌నాయక్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న అనురాధ

ప్రజా వ్యతిరేక నిర్ణయాలు

కడ్తాల్: లగచర్లలో గిరిజనుల పోరాటానికి ఫలితం దక్కిందని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. మా భూములు మాకు కావాలని బాధిత గ్రామ ప్రజలు చేసిన పోరాటంతో రేవంత్ సర్కార్ దిగివచ్చిందని, భూసేకరణ రద్దు చేస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.